యీ రోడ్డుమీద కాసేసి కార్ల (కార్లను) దొంగలాడీసేద్దవు. ఏటంటవు?''

''రైట్'', దర్మరాజు అన్నాడు, ''ఇది గొదిగోరొరె. నా ఆలోశనవు. జయోరం రాత్తిరి గొప్పిలినుంచి నివ్వు, గోకర్ణపురవు నుంచి నేను, లాస్టుబస్సుల యెల్లిపోయొచ్చీసి రైలు గేటుకాడ దిగీసేస్తము. తోలేత (ముందర) పొత్తంగి సిరిపురం నుంచి అప్పలసామి, జిళ్ళుళ్ల నుంచి సింవశెలంగోడు అక్కడికొచ్చీసి వుంటరు. నివ్వు గేటు కాడ్నుంచి అట్టగట్టగ అడ్డంగ నడిసీసి యిక్కడికెల్లి పోయొచ్చీసేస్తవు. ఇదిగిదిగో యీ సాల (పశువుల శాల) కాడ పాసి సెట్టీక్కస్తవు. (పాచనిచెట్టు- పొడుగ్గా ఎదిగే ఒక వృక్షం). నివ్వు సేతుల పెద్ద బాటరీ యెట్టుగునుంటవు. మేవందరవూ అక్కడ గేటుకాడ్నుంచి నడిసీసి శాసనాం సెంటరు కొస్తము. అక్కడ మహేంద్రవు నదిమీద బ్రిడ్జికాడ యింకో గొప్పపాసిసెట్టున్నాది కాదా, సింవశెలంగోడు ఆ సెట్టెక్కీసేస్తడు. ఇంకో బేట్రీ అట్టుగుంతడు. ఇక్కడికాడ్నుంచి నివ్వు లైటు కొట్టినవంటె ఆడి కగుపిస్తది. ఆడుకొడితె నీకగుపిస్తది. ఇక్కడికాడ్నుంచి అక్కడికి మూడుమైళ్లే దూరం కాదా! యింకా రోడ్డు సంద్రవంకలాగ వంకరగున్నాదికాదా, అందుకనగుపిస్తది. నేను, అప్పలసామి అక్కడే బ్రిడ్జి కింద దాక్కొనుంటవు.

'' అప్పుడేటవుతాదంటె యీ అరిపురం సెంటరుకాడ్నుంచి యేటయిన సిన్నకారొచ్చినాదంటె, సింవశెలం గోడికి నివ్వు బాట్రీ కొట్టియ్యి దానికిసూసీసినట్టు ఆడు మల్లి నీక్కొడతడు. మాకు కిందికి ఊలేస్తడు (ఈలవేస్తాడు) మేవు కింద సిద్దవుగుంటవు.

''డబ్బున్నోల్ల కారు కాకపోతె, అంటె ట్రాక్టరొ లారీయో అయితె నివ్వు బాట్రీ కొట్టొద్దు. ఆ కారు బ్రిడ్జికాడి కొచ్చీతలికి సింవశెలంగోడు మల్లి నీకు లైటు కొడతడు. రోడ్డు మీద మేఁవాకారడ్డేసి, దాన్ల పన్ని (దువ్వెన) కూడా మిగలకుండ దొంగలాడేస్తము. ఆడు అప్పుడు ఆడి వాగి (కండువా) అడ్డెట్టేసి నీకు ఎర్రలైటు కొడ్తాడు. అప్పుడు నివ్వు దిగిపో. మనవందరవూ మల్లి రైలు గేటుకాడికి బేగెల్లి పోయొచ్చిస్తము. మొహంతో వోరి తోట్ల కూసుని పంచీసుకుందము... ఉప్పుడేటంటె, ఆ కార్ల అల్లుగాని కంగాలి (గొడవ) సేసినరంటె నేను కస్సున పొడిసేస్తను. ఆ తర్వతేటయితె మనకేటి?... ఎట్టాగుందేటి మన ఆలోశనవు?'' ధర్మరాజు సగర్వంగా మూతిమీదలేని మీసాన్ని దువ్వుకున్నాడు.

జగన్నాథు కళ్లు మెరిసాయి. '' యేరుశెనగలలొలిసేసుకుని తినీసిన యెల్లుగ్గొడ్డు లాగుందిర నీ బుర్ర! నీ జేబుల యింకొ బీడివుంటె యియ్యి'' అన్నాడు.

ధర్మరాజు ఇంకో బీడితీసి జగన్నాథుకిచ్చాడు. '' వొకిటికాదు, వందిస్తను నివ్వు మాత్తరం ఎర్రలైటు సూసీగానే గేటుకాడి కొచ్చీయాల. నాకు సాయవు సెయ్యాల. నా సేతిల కొచ్చిన డబ్బు ఎట్టపోతదొ సూస్తను. ఆ పంతులు వొట్టి పిత్తబుర్రెదవని సూపిస్తను.''

ఇద్దరూ ఎడమకి తిరిగి, రోడ్డు దిగి పొలాల్లోనుంచి అడ్డతోవపట్టారు. సింహాచలానికి అప్పలస్వామికి ఈ కబురెట్లా అందచెయ్యాలో, తమ ప్లాను నిరాఘాటంగా అమల్లోకి రావటానికి ఏవేవి ఆయుధాలు తీసుకోవాలో, ఎన్నెన్ని జాగ్రత్తలు తీసుకోవాలో, - అన్ని వివరంగా చర్చించుకొన్నారు. చివరకు విడిపోయారు.

★ ★ ★

